ఇటు కోతలు.. అటు కాసులు!

టాప్-5 కంపెనీల్లో 80 వేల మంది ఉద్యోగాలు ఊస్టింగ్

ఏఐ సాంకేతికతతో ఆయా పోస్టుల భర్తీ

ప్రపంచ వ్యాప్తంగా సంచలనాలు సృష్టిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) వల్ల మిశ్రమ ఫలితాలు కలుగుతున్నాయి. ఓ వైపు దీని వల్ల వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. మరోవైపు ఈ సాంకేతికతను అంది పుచ్చుకోవడానికి కంపెనీలు పోటీ పడటంతో ఏఐ మార్కెట్ భారత్‌లో ఏటా 25-35 శాతం వృద్ధి నమోదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏఐ మూపుతున్న ప్రభావాన్ని రెండు భిన్న కోణాల్లో పరిశీలిద్దాం.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రవేశంతో టెక్నాలజీ రంగంలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఉద్యోగుల స్థానంలో ఏఐని ప్రవేశపెట్టి..లాభాలను పెంచుకోవటంపై టెక్ కంపెనీలు దృష్టి సారించాయి. ఒక్కో టెక్ కంపెనీ ఈ దిశగా అడుగులు వేయటంతో..సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పెద్ద సంఖ్యలో ఊడుతున్నాయి. గత 12 నెలల్లో 5 దిగ్గజ కంపెనీలు 80 వేలకు పైగా ఉద్యోగులకు గుడ్ బై చెప్పాయి. గూగుల్ గత ఏడాది 20.7 బిలియన్ డాలర్ల ఆదాయం పొందినా వేలాది ఉద్యోగులను ఇంటికి పంపించి, గుట్టుచప్పుడు కాకుండా ఏఐ సాంకేతిక పరిజ్ఞాన్ని వాడుకుంటున్నదని ఐటీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే 2023లో గూగుల్ లాభం 52 శాతం పెరిగిందని నివేదికలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఐటీ రంగంలో కృత్రిమ మేధస్సు వల్ల ఉద్యోగాల కల్పన 78 శాతం తగ్గనున్నదని 'నాస్కామ్' అంచనా వేస్తున్నది. ఇదిలా ఉండగా, సాంకేతికతను అందిపుచ్చుకున్న వారికి ఉద్యోగావకాశాలు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. చాలా కంపెనీలు ఉద్యోగులకు ఏఐ ఆధారిత సాంకేతికతపై శిక్షణా కార్యక్రమాలను చేపట్టాయని అన్నారు.

గత 12 నెలల్లో ఉద్యోగాల తొలగింపు ఇలా..

కంపెనీ	ఉద్యోగుల సంఖ్య
అమెజాన్	27,400
మెటా	21,000
గూగుల్	13,100
మైక్రోసాఫ్ట్	11,150
సేల్స్ ఫోర్స్	10,100
ఎక్స్ (ట్విట్టర్)	3,900

భారత ఏఐ మార్కెట్ లక్షన్నర కోట్లు!

- 2027 నాటికి భారీగా వృద్ధి చెందే అవకాశం
- ఏటా 25-35 శాతం వృద్ధిరేటు: నాస్కామ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ప్రపంచ సాంకేతిక రంగాన్ని ఓ ఊపు ఊపేస్తున్న కృత్రిమ మేధ (ఏఐ)కు భారత్‌లో అసాధారణ అవకాశాలున్నాయని భారత జాతీయ ఐటీ పరిశ్రమలు, సేవల సమాఖ్య (నాస్కామ్), బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) ప్రకటించాయి. 2027 నాటికి భారత ఏఐ మార్కెట్ విలువ రూ.1.4 లక్షల కోట్లకు చేరుకొంటుందని అంచనా వేశాయి. 2024-27 మధ్య ఏఐ మార్కెట్ వృద్ధిరేటు ఏకంగా 25 నుంచి 35 శాతం వరకు ఉంటుందని ఈ సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నాయి. భవిష్యత్తు అంతా కృత్రిమ మేధ దేనని అంచనాలు వెలువడుతున్న నేపథ్యంలో ఆ టెక్నాలజీని అందిపుచ్చుకొనేందుకు కంపెనీలు పోటీ పడి పెట్టుబడులు పెడుతున్నాయి. భారీ పరిశ్రమ నుంచి మనిషి నిత్యావసరాల వరకు అన్ని రంగాల్లో ఏఐ ఆవశ్యకతను గుర్తించిన సాఫ్ట్‌వేర్ కంపెనీలు, అత్యుత్తమ ఏఐ టూల్స్‌ను అవిష్కరించేందుకు శ్రమిస్తున్నాయి. అత్యుత్తమ ఏఐ నిపుణులకు భారత్ నిలయంగా మారింది. నాస్కామ్ అంచనా ప్రకారం దేశంలో 4,20,000 మంది అత్యుత్తమ నిపుణులు ఉన్నారు. 65 టాప్ ఐటీ కంపెనీల కార్యకలాపాలను అధ్యయనం చేసి ఈ నివేదికను విడుదల చేశారు.

రన్‌వే పైనే విమానం.. ఊపిరాడని చిన్నారులు!

ముంబై: ముంబై నుంచి శనివారం ఉదయం టేకాఫ్‌కు సిద్ధమైన ఎయిర్ మారిషస్‌కు చెందిన ఎంకే 479 విమానం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో ఐదు గంటల పాటు దాన్ని నిలిపివేశారు. ఏసీలు పనిచేయక పోవడంతో గాలి అందక అందులోని ప్రయాణికులు పలు ఇబ్బందులు పడ్డారు. విమానంలో ఉన్న పిల్లలు, 78 ఏండ్ల బనూదత్ బూలాకి అనే మహిళ శ్వాస సంబంధ సమస్యలు ఎదుర్కొన్నారు. ఇంత ఇబ్బందిపడినా తాము కిందకు దిగడానికి సిబ్బంది అంగీకరించలేదని ప్రయాణికులు ఆరోపించారు. ఆ తర్వాత కూడా సాంకేతిక సమస్య పరిష్కారం కాకపోవడంతో విమానాన్ని రద్దు చేస్తున్నట్టు ఎయిర్‌లైన్స్ నిర్వాహకులు తాపీగా ప్రకటించారు.

కొలనులో యాత్రికుల ట్రాక్టర్ బోల్తా

24 మంది దుర్మరణం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 24 మంది యాత్రికులు మరణించగా, 10 మంది గాయపడ్డారు. మృతుల్లో చిన్నారులు, మహిళలు ఉన్నారు. గంగా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు యాత్రికులు ట్రాక్టర్‌లో వెళ్తుండగా శనివారం తెల్లవారుజామున కాస్‌గంజ్ వద్ద అదుపుతప్పిన వాహనం కొలనులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక దవాఖానకు తరలించారు.

అయోధ్య రామయ్యకు 25 కోట్ల విరాళాలు

అయోధ్య, ఫిబ్రవరి 24: అయోధ్యలోని బాలరాముడి ఆలయానికి నెల వ్యవధిలో దాదాపు రూ.25 కోట్ల మేర విరాళాలు వచ్చాయి. ఇందులో 25 కేజీల బంగారం, వెండి ఆభరణాలు కూడా ఉన్నాయి.హుండీల్లో కానుకలతో పాటుగా చెక్కులు, డ్రాఫ్ట్‌లు, నగదును భక్తులు డిపాజిట్ చేశారని ట్రస్టు ఆఫీస్ ఇన్‌చార్జి ప్రకాశ్ గుప్తా తెలిపారు. అయితే నేరుగా ఆన్‌లైన్‌లో వచ్చిన విరాళాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియదన్నారు.

కొత్త నేర న్యాయ చట్టాలు

జూలై 1 నుంచి

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం గతేడాది ఆమోదించిన నేర న్యాయ చట్టాలు ఈ ఏడాది జూలై 1 నుంచి అమలు కానున్నాయి. దేశంలోని నేర న్యాయ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయడం కోసం ఈ చట్టాలను రూపొందించిన సంగతి తెలిసిందే. అయితే వాహనాలు ఢీకొట్టి ప్రమాదానికి గురైనపుడు, పరారయ్యే డ్రైవర్లపై చర్యలకు సంబంధించిన నిబంధనలు మాత్రం అమల్లోకి రావు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ శనివారం మూడు నోటిఫికేషన్లను జారీ చేసింది. కొత్త చట్టాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గతేడాది డిసెంబర్ 25న ఆమోదం తెలిపారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 106(2)ను మాత్రం జూలై 1 నుంచి అమలు చేయడం లేదని హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ తెలిపింది. ఏదైనా వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా, దురుసుగా వాహనాన్ని నడిపి, ఓ వ్యక్తి మరణానికి కారకుడైనపుడు, ఆ మరణం ఉద్దేశపూర్వక హత్యగా పరిగణింపబడనపుడు, ఆ సంఘటన గురించి పోలీసు అధికారికి లేదా మేజిస్ట్రేట్‌కు తెలియజేయకుండా ఆ డ్రైవర్ పరారైతే, ఆ డ్రైవర్‌కు గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించేందుకు ఈ సెక్షన్ అవకాశం కల్పిస్తున్నది. కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా స్పందిస్తూ, ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్‌తో సంప్రదించిన తర్వాతే ఈ నిబంధనను అమలు చేయడంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

యూపీలో లీకేజీ.. కానిస్టేబుల్ పరీక్ష రద్దు

లక్నో, ఫిబ్రవరి 24: పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం శనివారం రద్దు చేసింది. ఆరు నెలల్లోగా తిరిగి నియామక పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. పేపర్ లీక్ ఆరోపణలపై దర్యాప్తునకు స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ను(ఎస్‌టీఎఫ్) ఏర్పాటు చేసింది. ఈనెల 17, 18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన కానిస్టేబుల్ నియామక పరీక్షకు 48 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష రద్దును సీఎం యోగి ఆదిత్యనాథ్ ఎక్స్ పోస్టు ద్వారా వెల్లడించారు.పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో అక్రమాలకు పాల్పడిన కేసులో పోలీసులు 240 మందికి పైగా అరెస్టు చేశారు.

'ఇండియా'లో గందరగోళం!

- బెంగాల్‌లో కాంగ్రెస్‌కు ఒక్కసీటూ ఇవ్వం: టీఎంసీ
- పంజాబ్‌లో ఆప్ వర్సెస్ కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్నప్పటికీ సీట్ల పంపకం విషయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పరిస్థితి గందరగోళంగా కనిపిస్తున్నది. సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తో సీట్ల పంపకంపై త్వరలోనే తుది నిర్ణయం వెలువడుతుందన్న వార్తలకు తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) తెరదించింది. రాష్ట్రంలోని మొత్తం 42 లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని, ఇందులో ఎలాంటి మార్పు లేదని టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ స్పష్టం చేశారు. మరోవైపు ఢిల్లీతోపాటు గుజరాత్, హర్యానా, గోవా పోటీకి సంబంధించి కాంగ్రెస్, ఆప్ మధ్య ఒప్పందం కుదిరింది. ఢిల్లీలో ఆప్ 4, కాంగ్రెస్ 3 చోట్ల పోటీ చేయనున్నాయని ప్రకటించారు. గుజరాత్‌లోని 26 సీట్లకుగానూ రెండు స్థానాల్లో మాత్రమే ఆప్ బరిలో నిలవనుండగా.. మిగతా 24 స్థానాల్లో కాంగ్రెస్ పోటీచేస్తుంది. హర్యానాలోని 10 సీట్లలో కాంగ్రెస్-9, ఆప్-1 చొప్పున పంచుకొన్నాయి. ఇక గోవాలోని రెండు ఎంపీ స్థానాలు, చండీగఢ్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పోటీచేసేలా రెండు పార్టీలు ఒప్పందం చేసుకొన్నాయి. అయితే ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్‌లో మాత్రం కాంగ్రెస్, ఆప్ వేర్వేరుగా బరిలో నిలవనున్నాయి.

అదే జిల్లాలో పోస్టింగ్ ఇవ్వొద్దు

- ఎన్నికల వేళ అధికారుల బదిలీల్లో కేంద్ర ఎన్నికల సంఘం మార్పులు
- ప్రభుత్వ నిబంధనల లొసుగుల సర్దుబాటుపై రాష్ట్రాలకు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : త్వరలో జరగబోయే సార్వత్రిక, కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భారత ఎన్నికల సంఘం అధికారుల బదిలీల విషయంలో శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిబంధనల్లోని లొసుగులను తమకు అనుకూలంగా మలచుకోకుండా అధికారుల బదిలీల విధానాన్ని ఈసీ సర్దుబాటు చేసింది. విధాన నిర్ణయాలలో భాగంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పొరుగు జిల్లాలకు అధికారులను బదిలీ చేయవచ్చునని, అయితే వారి పోస్టింగ్ ఇంతవరకు వారున్న పార్లమెంట్, అసెంబ్లీ పరిధిలో ఉండకుండా చూసుకోవాలని, బదిలీల స్ఫూర్తి ఇదేనని ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల్లోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకుని రాష్ట్ర ప్రభుత్వాలు అధికారుల బదిలీల విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈసీ ప్రకటించింది. దీని ప్రకారం సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారితో పాటు తాము పనిచేస్తున్న చోట మూడేండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అధికారులు ఆయా పార్లమెంట్, అసెంబ్లీ పరిధిలోని జిల్లాలకు కాకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలి. పోటీలో ఉన్న అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించకుండా నివారించడానికే ఈ బదిలీలు చేస్తున్నట్టు ఈసీ ప్రకటించింది. అయితే ఇది కేవలం రెండు లోపు పార్లమెంటరీ నియోజకవర్గాలున్న రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించదని వివరించింది. ఈ ఆదేశాలతో తెలంగాణలో స్వల్ప సంఖ్యలో మరో సారి బదిలీలు జరిగే అవకాశం ఉంది.

హామీల అమలుపై ఓటర్లు తెలుసుకోవచ్చు

చెన్నై: రాజకీయ పార్టీలు ఇచ్చే ఎన్నికల హామీల అమలు సాధ్యాసాధ్యాల గురించి తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉంటుందని కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య అధికారి రాజీవ్ కుమార్ అన్నారు. అయితే ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. శనివారం చెన్నైలో మీడియాతో మాట్లాడుతూ 'వాగ్దానాలతో మ్యానిఫెస్టోను విడుదల చేసే హక్కు రాజకీయ పార్టీలకు ఉంటుంది. ఆ హామీల్లో వాస్తవమెంత? వాటి అమలుకు నిధులు ఎలా సమకూరుస్తారు? అన్నది తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉంటుంది' అని పేర్కొన్నారు.

భాషల అనువాదానికి 'భాషిణి'

న్యూఢిల్లీ: భారతదేశంలో చాలా మతాలు, ప్రాంతాలున్నాయి. ఉపాధి లేదా ఇతర అవసరాల నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లి, మాతృభాష తప్ప వేరే భాష రాని వారు కమ్యూనికేషన్ విషయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో దీనికి పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం 'భాషిణి' పేరుతో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత యాప్‌ను అభివృద్ధి చేసింది. ఇది ఒక భారతీయ భాషను మరో భాషలోకి, అదే విధంగా ఇంగ్లిష్ నుంచి భారతీయ భాషలోకి అనువదిస్తుంది. ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐవోఎస్ వేదికల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

జాహ్నవి కేసులో సమీక్ష కోరిన భారత్

న్యూఢిల్లీ: అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తెలుగమ్మాయి జాహ్నవి కేసులో అమెరికన్ పోలీసులపై ఎలాంటి ఆధారాల్లేవని అతన్ని అమెరికా కోర్టు విడుదల చేయటంపై భారత్ విస్మయం వ్యక్తం చేసింది. తీర్పుపై సమీక్ష చేయాలని భారత రాయబారి కార్యాలయం శనివారం కోరింది. జాహ్నవి కుటుంబానికి న్యాయం జరిపేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపింది. జాహ్నవి కేసుపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో చర్చిస్తున్నట్టు వెల్లడించింది.

చైనా హ్యాకర్ల చేతిలో మన ఇమ్మిగ్రేషన్ డాటా!

వాషింగ్టన్ పోస్ట్ పరిశోధనాత్మక కథనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: పక్కలో బల్లెంలా ఉన్న చైనా నుంచి భారతదేశానికి పలు రకాల ముప్పు పొంచి ఉన్నది. తాజాగా భారత వలసదారులకు సంబంధించి వంద గిగా బైట్ల డాటాను చైనాకు చెందిన హ్యాకర్లు చోరీ చేసినట్టు బయటపడింది. చైనాకు చెందిన కొన్ని హ్యాకింగ్ ముఠాలు విదేశాల్లోని ప్రభుత్వాలు, సంస్థలపై సైబర్ నేరాలకు పాల్పడినట్టు వాషింగ్టన్ పోస్ట్ పరిశోధనలో వెల్లడైంది. ఇండియా నుంచే కాక పలు దేశాల నుంచి చైనా హ్యాకర్లు కీలక సమాచారాన్ని దొంగిలించినట్టు కథనాలు ప్రచురితం కావటంతో కలకలం రేగింది. మన డాటా చోరీ చేసిన హ్యాకింగ్ సంస్థకు చైనా ప్రభుత్వం మద్దతున్నదని కథనంలో పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్, ఆపిల్, గూగుల్ సంస్థలకు చెందిన సాఫ్ట్‌వేర్ వ్యవస్థల్లో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుని హ్యాకర్లు ఈ సైబర్ దాడులకు పాల్పడినట్టు కథనం పేర్కొన్నది. షాంఘై కేంద్రంగా పనిచేస్తున్న ఐసూన్ కంపెనీకి చెందిన పత్రాలు లీకైనట్టు వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. గత వారం ఈ వివరాలు గిట్‌హబ్‌లో వెలుగు చూశాయి. చైనా ప్రభుత్వ కంపెనీలు, మంత్రిత్వ శాఖలకు ఈ సంస్థ థర్డ్ పార్టీగా సేవలందిస్తున్నది.

అస్సాంలో ముస్లిం వివాహ చట్టం రద్దు!

మైనారిటీల పట్ల వివక్షేనని విపక్షాల ధ్వజం

గువాహటి, ఫిబ్రవరి 24: ముస్లింల వివాహ, విడాకుల చట్టంపై అస్సాం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అస్సాం ముస్లింల వివాహాలు, విడాకుల నమోదు చట్టం-1935ను రద్దుకు రాష్ట్ర మంత్రివర్గం శనివారం ఆమోదం తెలిపింది. బాల్య వివాహాలకు అంతం పలకడానికే ఈ చర్య తీసుకున్నట్టు సీఎం హిమంత బిశ్వ శర్మ ప్రకటించారు. చట్ట ప్రకారం పురుషులకు 21, స్త్రీలకు 18 ఏండ్లు నిండితేనే వివాహానికి అర్హులని, అయితే ఇంతవరకు ఉన్న చట్టం ప్రకారం వారికి ఆ వయసు లేనప్పటికీ వివాహ నమోదుకు అంగీకరించేవారని, దీంతో బాల్య వివాహాలకు ఊతమిచ్చినట్టయ్యిందని ఆయన తెలిపారు. తాము తీసుకున్న ముఖ్యమైన ఈ నిర్ణయంతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. ప్రస్తుతమున్న 94 ముస్లిం వివాహ రిజిస్ట్రార్‌లు అస్సాం ఐజీపీ (రిజిస్ట్రేషన్) పరిధిలోకి వస్తారని చెప్పారు. అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని విపక్షాలు ఖండించాయి. ఇది ముస్లింల పట్ల వివక్షాపూరితంగా ఉందని, ఎన్నికల సమయంలో ఓటర్ల ప్రలోభానికి ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించాయి.

మెక్రాన్‌కు రైతుల నుంచి తీవ్ర నిరసన

పారిస్: ఫ్రాన్స్ వ్యాప్తంగా కొన్ని నెలల నుంచి నిరసన తెలుపుతున్న రైతన్నలు శనివారం ఆ దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మెక్రాన్‌కూ నిరసన తెలిపారు. పారిస్ వ్యవసాయ సదస్సును ప్రారంభించేందుకు వచ్చిన మెక్రాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధరను ప్రకటించాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మెక్రాన్ స్పందిస్తూ.. రైతులకు అత్యవసరంగా సహాయపడేందుకు ఓ ప్రణాళికను సోమవారం నుంచి అమలు చేస్తామని చెప్పారు.

1.25 లక్షల కోట్లతో గోదాముల నిర్మాణం

న్యూఢిల్లీ: సహకార రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ధాన్యాల నిల్వ పథకాన్ని శనివారం ప్రధాని మోదీ ప్రారంభించారు. వచ్చే ఐదేండ్లలో రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడితో 700 లక్షల టన్నుల ఆహార నిల్వ సామర్థ్యాన్ని సృష్టిస్తామని ప్రకటించారు. 11 రాష్ట్రాల్లో 11 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఏర్పాటు చేసిన 11 గోదాములను కేంద్రం ప్రారంభించింది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా గోదాములను నిర్మించనున్నామని కేంద్రం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

ఎల్ఐసీ పాలసీ మెచ్యూరిటీ క్లెయిమ్ ఎలా?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఒక్కసారి మీ ఎల్ఐసీ పాలసీ గడువు తీరిపోతే.. మెచ్యూరిటీ నగదు మొత్తాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కస్టమర్లు ఇందుకోసం క్లెయిమ్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనూ ఈ మెచ్యూరిటీ క్లెయిమ్‌ను దాఖలు చేయవచ్చు. ఎల్ఐసీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఇందుకు వీలున్నది.

పాలసీదారులు ఏం చేయాలి?

ముందుగా పాలసీదారులు తమ బ్యాంక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఆఫ్ ఇండియా సూచిస్తున్నది. అలాగే పాలసీ సొమ్మును పొందేందుకు కేవైసీ (నో యువర్ కస్టమర్)ని కూడా దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఎండోమెంట్ మెచ్యూరిటీ క్లెయిమ్స్

ఎండోమెంట్ పాలసీల్లో గడువు తీరిన తర్వాతే చెల్లింపులు జరుగుతాయి. ఈ మేరకు పాలసీ వ్యవధి పూర్తవడానికి కనీసం రెండు నెలల ముందైనా సంస్థ తమ కస్టమర్లను అలర్ట్ చేస్తుంది. కావాల్సిన పత్రాలను సమర్పిస్తే లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమవుతుంది. పూర్తయిన డిశ్చార్జీ ఫామ్, పాలసీ డాక్యుమెంట్, నెట్ట్ ఫామ్, కేవైసీ వంటివి అవసరం.

మనీ-బ్యాక్ పాలసీల్లో..

రూ.5 లక్షలదాకా మొత్తాల చెల్లింపులకు పాలసీ డాక్యుమెంట్‌తో పనిలేదు. జీవన్ ఆనంద్ ప్లాన్ కింద రూ.2 లక్షల వరకు కూడా పాలసీ బాండ్ల అవసరం లేదు. ఈ రకమైన పాలసీల్లో పాలసీ వ్యవధి మొత్తంగా నగదు భరోసా ఉంటుంది. కాలానుగుణ చెల్లింపులుంటాయి.

డెత్ క్లెయిమ్‌లు

బకాయిల్లేకుండా ప్రీమియంలు చెల్లించాల్సి ఉంటుంది. పాలసీ వ్యవధిలోనే మరణం సంభవించాలి. అలాగే క్లెయిమ్ ఫామ్ ఏలో క్లెయిమ్ చేస్తున్నవారు మృతుల వివరాలన్నింటినీ పేర్కొనాలి. డెత్ సర్టిఫికెట్‌ను సమర్పించాలి. ఒరిజినల్ పాలసీ డాక్యుమెంట్ ఉండాలి. ఒకవేళ పాలసీదారుని వయసు పేర్కొనకపోతే ఏజ్ సర్టిఫికెట్ అవసరం.

- రిస్క్ లేదా పాలసీ పునరుద్ధరణ జరిగిన మూడేండ్లలోపు మరణం సంభవిస్తే.. క్లెయిమ్ ఫామ్ బీ అవసరం. ఇందులో పాలసీదారుడు చనిపోయిన చివరి రోజుల్లో వారికి సేవలందించిన వారి ద్వారా మెడికల్ అటెండెంట్స్ సర్టిఫికెట్‌ను ఇవ్వాలి.
- దవాఖానలో చికిత్స తీసుకుంటే క్లెయిమ్ ఫామ్ బీ1 అవసరం.
- ఆఖరి రోజుల్లో చికిత్సను అందించిన వైద్యుడిచే క్లెయిమ్ ఫామ్ బీ2ను తీసుకోవాలి.
- తెలిసినవారిచే గుర్తింపు, అంత్యక్రియలకు సంబంధించి క్లెయిమ్ ఫామ్ సీని ఇవ్వాల్సి ఉంటుంది.
- చనిపోయిన పాలసీదారుడు ఉద్యోగి అయితే వారి సంస్థ చేత క్లెయిమ్ ఫామ్ ఈని ఇప్పించాలి.

ఉబర్‌తో కలిసి పనిచేస్తాం: అదానీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: గౌతమ్ అదానీ.. శనివారం ఉబర్ సీఈవో దారా ఖోస్రోవ్‌షాహితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారత పర్యటనలో ఉన్న ఆయనను అదానీ కలుసుకోవడం ప్రాధాన్యం సంతరించుకున్నది. దీంతో భవిష్యత్తులో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు సంకేతాలిచ్చారు. 'భారత్‌లో ఉబర్ విస్తరణకోసం ఆయన తీసుకుంటున్న చర్యలు స్ఫూర్తిదాయకం. ప్రత్యేకంగా దేశీయ డ్రైవర్ల గౌరవాన్ని పెంచడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. భవిష్యత్తులో ఆయనతో పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నాను' అని గౌతమ్ అదానీ తన ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. రేవుల నుంచి ఎనర్జీ వరకు సేవలు అందిస్తున్న అదానీతో సమావేశం కావడం చాలా సంతోషంగా ఉన్నదని, ముఖ్యంగా మొబిలిటీ సేవలు అందించడానికి తీసుకుంటున్న చర్యలను దారా అభినందించారు. అయితే దారాతో ఉన్న ఫొటోను పోస్ట్ చేసిన అదానీ.. ఎక్కడ కలిసిన విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఈ వారం మొదట్లో భారత పర్యటనకు వచ్చిన దారా.. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ)తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. కాగా, వచ్చే పదేండ్లకాలంలో అదానీ గ్రూపు 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్టు ప్రకటించింది.

ఎఫ్‌డీలపై వడ్డీలను పెంచిన రెండు బ్యాంకులు

అర శాతం వరకు సవరించిన హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజాలు డిపాజిట్‌దారులకు శుభవార్తను అందించాయి. డిపాజిట్లపై వడ్డీరేట్లను అర శాతం వరకు పెంచుతున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు ప్రకటించాయి. రూ.2 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్న ఐసీఐసీఐ బ్యాంక్..సాధారణ డిపాజిట్లకు 7.2 శాతం వరకు చెల్లిస్తున్నది. ఏడాది కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీని 6 శాతం నుంచి 6.50 శాతానికి పెంచిన బ్యాంక్, రెండేండ్ల నుంచి ఐదేండ్లలోపు డిపాజిట్లపై 7 శాతం నుంచి 7.50 శాతానికి సవరించింది. అలాగే ఐదేండ్ల నుంచి పదేండ్ల డిపాజిట్లపై రేటుని 6.90 శాతం నుంచి 7.50 శాతానికి పెంచింది. మరోవైపు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన డిపాజిట్లపై రేట్లను పావు శాతం సవరించింది. ఏడు రోజుల నుంచి 10 ఏండ్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేట 3.5 శాతం నుంచి 7.75 శాతం లోపు చెల్లించనున్నది.

వాణిజ్య

ఫెడ్ కంటే ముందే వడ్డీరేట్లు తగ్గే అవకాశం

ఆర్బీఐ ఎంపీసీ సభ్యుడు జయంత్ వర్మ

ముంబై, ఫిబ్రవరి 24: ఫెడరల్ రిజర్వు కంటే ముందే వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలున్నాయని రిజర్వుబ్యాంక్ ఎంపీసీ సభ్యుడు జయంత్ ఆర్ వర్మ తెలిపారు. గత సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచ